క్లుప్తంగా

ఈరన్నస్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమావాస్యకు వచ్చిన భక్తులు సోమవారం కూడా స్వామి దర్శనానికి వేచి ఉండడంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకుంది.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

ఈరన్నస్వామి ఆలయం హుండీ ఆదాయ లెక్కింపును మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే వారు ప్రతి ఒక్కరూ పంచ, ఉత్తరీయము (టవల్) తప్పక ధరించాలని కోరారు.

పదవీ విరమణ సన్మానం



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి భాస్కర్‌నాయుడికి సన్మానం చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఆదోని టౌన్: ఆదోని రూరల్ వాటర్ సప్లై డివిజనల్ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న ఇ.ఎన్.వి. భాస్కర్‌నాయుడు గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సోమవారం కార్యాలయంలో సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈఈ పద్మజ ఆధ్వర్యంలో డీఈ సాంబయ్య, ఏఈ నాగమల్లయ్య, ఈ.సి.వెంకటేష్, అధికారులు నాగలక్ష్మి, నాగరవి, రాజశేఖర్, మధుకృష్ణాచారి, హనుమంతు, సిబ్బంది భాస్కర్‌నాయుడు దంపతులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

డీఏఓగా మాధవరెడ్డి

ఆదోని టౌన్: ఆదోని రూరల్ వాటర్ సప్లై (ఆర్‌డబ్ల్యూఎస్) డీఏఓగా కె.మాధవరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మాధవరెడ్డి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో డీఏఓగా పనిచేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో డీఏఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రిలో కొందరు వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని భారత ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్న ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో చర్మవ్యాధి డాక్టర్ రవికుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, సూపరింటెండెంట్‌ను కూడా లెక్కచేయడంలేదని తెలిపారు.

వెండి కడియాల అపహరణ

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని మొట్టివీధిలో బండా సన్నమ్మ అనే వృద్ధురాలు చేతికి ఉన్న వెండి కడియాలను గుర్తు తెలియని వ్యక్తి సోమవారం దొంగలించాడు. వృద్ధురాలు ఇంటి ఆవరణలో కూర్చొని ఉన్న సమయంలో దుండగుడు వచ్చి ఆమె చేతికి ఉన్న ఆరు వెండి కడియాలను తీసుకొని పరారయ్యాడు. సుమారు 40 తులాలు వెండి రూ.50 వేలు ఉంటుంది. ఇంట్లో ఉన్న కుమారుడు రంగస్వామి తల్లి సన్నమ్మను టిఫిన్ చేయడానికి లోపలికి పిలిచాడు. లోపలికి వెళ్లాక తల్లి చేతికున్న కడియాలు పోయినట్లు గుర్తించాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

వాల్మీకి సమితి అధ్యక్షుడిగా రాంభీంనాయుడు



మాట్లాడుతున్న వీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి

ఆదోని టౌన్: రాయలసీమ జిల్లాల బోయ వాల్మీకి సమితి అధ్యక్షుడిగా రాంభీంనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆదోని పట్టణంలోని మంగళ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన బోయ వాల్మీకి సమితి ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు వీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ల అంజి తెలిపారు. గత ఆరు దశాబ్దాలుగా వాల్మీకులను ఎస్టీలుగా చేర్చాలని ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. అయితే ప్రభుత్వాలు ఈ డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సింహం నాగేంద్ర, సుధాకర్, సురేంద్ర, సాయి ప్రసాద్, రంగన్న, భోజ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

కౌతాళం: అందరి సహకారంతో ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస రెడ్డి, రవికుమార్, ప్రకాశ్‌రాజ్, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యం అంతరాయం.. ప్రయాణం నరకప్రాయం!

- ఆదోనిలో రహదారుల విస్తరణ జరగక నిత్యం ట్రాఫిక్ సమస్య
- ఆక్రమణలతో ఫుట్‌పాత్ కనుమరుగు
- అస్తవ్యస్త డ్రైనేజీతోనూ సమస్యే
- పట్టణవాసులకు తప్పని అవస్థలు

ఆదోని సెంట్రల్: సెకండ్ ముంబాయిగా పేరు గాంచిన ఆదోని అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు సతమత మవుతున్నారు. జానాభా పెరుగుతున్నా రహదారుల విస్తరణ చేపట్టకపోవడంతోనే సమస్య తలెత్తుతోందని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ చేపడితే ట్రాఫిక్ సమస్యలతో పాటు డ్రైనేజీ సమస్యలు తీరుతాయని అభిప్రాయపడుతున్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు మీద బతికే చిరు వ్యాపారుల బంకులను తొలగిస్తున్నారే తప్ప రహదారుల విస్తరణ మాత్రం చేపట్టడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

2 లక్షలకుపైగా జనాభా

పట్టణంలో 2లక్షలకుపై బడి జనాభా ఉంది. 12 నుంచి 14 దాకా ప్రధానమైన రహదారులు ఉన్నాయి. ఆయా రహదారుల్లో నిత్యం 36 నుంచి 40వేల దాకా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా పనుల నిమిత్తం 45 వేల మంది ప్రజలు నిత్యం రోడ్లపై తిరుగుతుంటారు. అయితే జానాభా అవసరాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ జరగకపోవడంతో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. దీంతో వాహనదారులు, పాదాచాలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆక్రమణలతో కుంచించుకుపోయిన రహదారులు

పట్టణంలోని పురపాలక రహదారి, ఎమ్మిగనూరు రహదారి, పూల బజార్, బీఎన్ టాకీస్, పండిట్ నెహ్రూ, తానాజీ, బంగారు బజారు, చిన్న మార్కెట్, కొత్తబస్టాండు రహదారి, కంచిగారి వంటి వీధులలో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అయా ప్రాంతాల్లో ఉన్న ఫుట్‌పాత్‌లు కనిపించడం లేదు. వ్యాపార సముదాయాలను యజమానులు ముందుకు జరపడంతో అవన్నీ నేడు కనుమరుగయ్యాయి. ఇక బంగారు బజారు అయితే వందల మంది తో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ షాపుల ముందు వాహనాలు నిండి ఉంటాయి. ఇక్కడ వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే రాక పోకలు స్తంభించి పోతాయి. అక్కడ నుంచి బయటికి రావడానికి గంటల తరబడి వేచి చేయాల్సి వస్తుంది. సర్వజన ఆసుపత్రి నుంచి శ్రీనివాసభవన్ మీదుగా కొత్త బస్టాండుకు వెళ్లే దారిలో గతంలో ఫుట్‌పాత్‌లు ఉండేవి. ప్రస్తుతం అవి ఏమి కనిపించడం లేదు. దీంతో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతారాయం కలుగుతోంది.

మురుగుతో వాహనదారులకు తిప్పలు

మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వర్షం వచ్చిందంటే నీళ్లు రహదారుల మీదకు వచ్చి చేరుతాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. సంవత్సరానికి ఒకసారి పురపాలక అధికారులు మురుగు కాలువలలోని మట్టిని తొలగించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప కాలువలను పటిష్ట పరచడం లేదు. షాపులకు చెందిన యజమానులే తమ పరిధి వరకు మురుగు కాలువను కట్టుకుని సరిచేసుకుంటున్నారు. పాలకులు మాత్రం కాలువల నిర్మాణ పనులను చేపట్టడం లేదు. దీంతో రహదారులు కుచించుకొని పోయాయి.

☛ రెండు రోజుల క్రితం పురిటి నొప్పులతో బాధపడుతున్న పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన లలిత అనే నిండు గర్భిణి క్రాంతినగర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి చేరుకోవడానికి ట్రాఫిక్ సమస్య కారణంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో స్కూటర్‌పై తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించడంతో వెంటనే పక్కన ఉన్న ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి డెలివరీ చేయించారు. సాధారణంగా అక్కడ డెలివరీ చేయరు, కానీ పరిస్థితి బట్టి మానవతా దృక్పథంతో అక్కడ ఉన్న సిబ్బంది ప్రసవం చేశారు. లేకపోతే ప్రాణాలు మీదకు వచ్చే పరిస్థితి ఏర్పడేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనంతరం 108లో తల్లీబిడ్డలను మాతాశిశు ఆసుపత్రికి తరలించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో చెప్పేందుకు ఇది నిదర్శనం.



ఎమ్మిగనూర్ రహదారిలో ట్రాఫిక్ ఇలా..



రద్దీగా ఉన్న పురపాలక రహదారి

ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది



పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పాదచారులు నడవడానికి కనీసం ఫుట్‌పాత్‌లు కూడా లేవు. దీనికి తోడు బండ్లు రోడ్ల మీదనే ఉండడంతో రాక పోకలకు అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్‌లో ఇరుక్కున్నామంటే కొన్ని సార్లు గంటల తడబడి వేచివుండాల్సి ఉంటుంది. రోడ్లు విస్తరణ చేపట్టి అభివృద్ధి చేపట్టాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. రోడ్లు విసరణను చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

– ముక్కన్న, ఆదోని

రోడ్ల విస్తరణ చేపట్టాలి



పట్టణంలో రోడ్లు విస్తరణను గాలికి వదిలేశారు. అభివృద్ధి పథంలో నడపాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యలతో, డ్రైనేజీ సమస్యలు తీవ్రమవుతున్నాయే గానీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. అక్రమణ దారులు ఆక్రమించుకోవడం వలన రోడ్లు కుచించుకుని పోయాయి. దీంతో పాదచారులు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైన పాలకులు స్పందించి రోడ్లు విస్తరణ పనులు చేపడితే బాగుంటుంది.

– లక్ష్మన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి

రమణీయం.. పైరయ్యస్వామి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

పెద్దకడబూరు: మండలంలోని బసలదొడ్డి పొలిమేరలో కొండల్లో వెలసిన పైరయ్యస్వామి రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గ్రామం నుంచి మల్లగానిమేటి, జమ్మనగేరిమేటి, దుర్గనమేటి, నల్లబోతుల మేటిగొళ్ల మల్లగాని హనుమంతరెడ్డి, గుడ్ల నర్సిరెడ్డి, చిన్నగౌడ్, యల్లప్ప ఇంటి నుంచి పూర్ణకుంబాలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని నైవేద్యం సమర్పించారు. ప్రధాన అర్చకులు పూజారి రామకృష్ణ వెండి ఆ భరణాలతో భీమసేన అలంకారంలో పైరయ్యస్వా మిని అలంకరించారు. సాయంత్రం గ్రామ పెద్దలు, మేటిగొళ్ల సమక్షంలో శ్రీ సీతారామ, లక్ష్మన సమేత విగ్రహాలను రథంపై ఆశీనులు గావించి రథోత్సవం ప్రారంభించారు.

పార్లపల్లిలో వైభవంగా రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్:పార్లపల్లి గ్రామంలో సోమవారం శ్రీ అభయ సీతారామాంజనేయస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారికి కల్యాణం జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి నుంచి పూర్ణ కుంభంతో వచ్చి రథం ముందు హోమం జరిపించారు. అనంతరం రథోత్సవం ప్రారంభించారు.

ఘనంగా బీరలింగేశ్వరుడి దేవర



పల్లకీలో బీరలింగేశ్వరుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నందవరం : మండల కేంద్రంలో వెలసిన కురబల కుల దైవం బీరలింగేశ్వరుడి దేవర సోమవారం ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం దేవాలయం నుంచి గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పల్లకీలో భీరలింగేశ్వ రుని విగ్రహాన్ని తుంగభద్ర నదికి తీసుకెళ్లి జలాభిషకం చేసి, పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం పవిత్ర గంగాజలాలను తెచ్చి గ్రామంలోని ఆలయాల్లోని దేవతామూర్తులకు జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కట్ట పరిధిలోని 82 గ్రామాల పూజారులు బండారితో పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పూరవీధుల్లో భీరలింగేశ్వర స్వామి విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్‌తో పాటు ఆలయ నిర్వహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

వైభవంగా వాయుదేవుడి ఉచ్చాయం



జనసందోహం మధ్య సాగుతున్న ఉచ్చాయం

మంత్రాలయం : మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో వాయుదేవుని ఉచ్చాయం వైభవంగా జరిగింది. సోమవారం గ్రామంలో కార్తీక మాస ముగింపును పురస్కరించుకుని జాతరను జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా గ్రామంలో ఆంజనేయ స్వామి ఉచ్చాయం నిర్వహించారు. అశేష జన సందోహం మధ్య మంగళవాయిద్యాలు, గొరవయ్యలు ప్రదర్శనలు, కర్ణాకట సంగీత డప్పుల మధ్య ఊరేగింపు సాగింది.

హైస్కూల్లో తాగునీటి బోరు ఏర్పాటు

కోసిగి: మండలకేంద్రం కోసిగి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యార్థం సాతనూరు మథర్ థెరిస్సా యూత్, జన జీవన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాగునీటి బోరు వేయించినట్లు ఆ సంఘం నాయకులు బందేనవాజ్, నజీర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. రిటైర్డ్ ఐజీ మహ్మద్ ఇక్బాల్ సహకారంతో విద్యార్థుల కోసం బోరును వేయించి మోటార్ అమర్చి తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. బోరులో 3 ఇంచుల నీళ్లు పడ్డాయి. దీంతో రిటైర్డ్ ఐజీ ఇక్బాల్, మథర్ థెరిస్సా, జనజీవన్ అసోసియేషన్ సభ్యులకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

98.78 శాతం పింఛన్ల పంపిణీ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 98.78 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ సోమవారం తెలిపారు. మొత్తం 16,799 మంది పింఛన్‌దారు లు ఉండగా,అందుకుగానూ రూ.7,19,62, 500 నగదును పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా 37వ వార్డు పర్వతాపురం ప్రా ంతానికి చెందిన బోయ గోవిందప్ప అనారోగ్య ం కారణంగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ పంపిణీ చేసేందుకు వెళ్లి న సుందర్‌బాబు సమాచారం తెలుసుకుని ప్రై వేట్ ఆస్పత్రికి వెళ్లి బాధితుడు బోయ గోవిందప్పకు సోమవారం పింఛన్‌ను అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోని టౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ అన్నారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మున్సిపల్ కాంప్లెక్స్ పనులు ప్రారంభించాలి

ఆదోని రూరల్: పట్టణంలో నిలిచిపోయిన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, నాగరాజు, నాగేంద్ర, వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దాదాపు రూ.33 కోట్లతో నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పట్ల అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. లబ్ధిదారులు ఇప్పటికే గుడ్‌విల్ ద్వా రా రూ.4 కోట్లు మున్సిపాలిటీకి చెల్లించారని చెప్పారు.



అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మోసం చేయడం చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మంత్రాలయం మండలం రాంపురంలోని స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అధికార దాహంతో ఆచరణకు సాధ్యం హామీలు గుప్పించడం, ప్రజలను బురిడీ కొట్టించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండానే ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఎన్నికల వేళ కరెంట్ చార్జీలు తగ్గిస్తామని ఊరూర ఊదరగొట్టిన బాబు.. ఆరు నెలల్లో రెండు పర్యాయాలు కరెంట్ బిల్లులు పెంచడం విచారకరమన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే రాష్ట్రంలో రోడ్లన్నీ బాగు చేస్తామని చెప్పి, ఇప్పుడు అంతర్గత రోడ్లకు సైతం యూజర్ చార్జీలు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. రహదారులు నిర్మించేందుకు బడ్జెట్ లేదని మరోవైపు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పడం హాస్యాస్పదమన్నారు.

అటకెక్కిన హామీలు

తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. కేవలం పింఛన్ల పంపిణీతో సరిపెట్టుకున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ రూ.10 వేలు జీతం ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఏకంగా ఆ వ్యవస్థకే మంగళం పాడటం శోచనీయమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు మోపుతూ కాలయాపనం చేయడం కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ఇచ్చిన హామీలకు కట్టుబడి పాలన సాగించాలని హితవు పలికారు. సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, కోసిగి, మంత్రాలయం మండలాల ఇన్‌చార్జ్‌లు పి.మురళీమోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, చెట్నిహళ్లి సర్పంచు ఆంజినేయులు, ఎంపీటీసీ రామాంజి, మాజీ సర్పంచులు నరసప్ప, అలింగప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కోసిగి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ విజయకుమారి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ సమీరారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్ల నిండిన తర్వాత వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా విభాగం టీమ్ లీడర్ ఆదినారాయణ, వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఆర్డీటీ సీఓ నాగేంద్ర, సమన్వయకర్త వీరేష్ పాల్గొన్నారు.

8 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ బాబు, సెల్ నంబర్ 88859 04099కు సంప్రదించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని చైతన్య ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సమ్మెళనం సోమవారం ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. 1994–98కి చెందిన పూర్వ విద్యార్థులందరూ కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ దత్తాత్రేయ, విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాజగోపాల్, విజయరాణి, జ్యోతిబాయి, శాంతకుమారి, శాంతబాయి, సుశీలమ్మ, నిర్మలలను సన్మానించారు.

అవినీతి ప్రిన్సిపాల్ రీపోస్టింగ్ రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల ఆకలికేకలకు కారణమై విధుల నుంచి తొలగించబడిన ప్రిన్సిపాల్ కవితకు రీపోస్టింగ్‌ను రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ప్రిన్సిపాల్ కవితపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్న డీఈఓపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు పోస్ట్ కార్డుల ద్వారా ఫిర్యాదు చేశారు. నాయకులు శేఖర్‌నాయుడు, మహేంద్రబాబు, కృష్ణ, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. సోమవారం సాయంత్రం ఆదోనిలోని రెడ్డిభవన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని 55 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఎన్నికలకు సంబంధించి ఈనెల 5వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 8వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గం, వాటర్ యూజర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఉంటాయన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11వ తేదీన ఎన్నికలు, ప్రాజెక్ట్ కమిటీలకు 14వ తేదీన ఎన్నికలు ఉంటాయని చెప్పారు. డివిజన్‌లోని సాగునీటి సంఘాల ఎన్నికల కోసం డివిజన్‌లో 1201 మంది ఎన్నికల సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శైలేశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

శివుడికి పంచలోహ ముఖ కవచం



పంచలోహ విగ్రహం అందజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణ పరిధిలోని న్యూచైతన్య నగర్‌కు చెందిన శివకుమార్ దంపతులు సుమారు రూ.40 వేలు విలువ చేసే పంచలోహ ముఖ కవచాన్ని సోమవారం విరాళంగా అందజేశారు. రాత్రి శివకుమార్ నివాసం నుంచి డప్పులు మంగళవాయిద్యాలతో ముఖ కవచానిన నాగలింగేశ్వరస్వామి సన్నిధికి చేరుకుని సమర్పించారు. అనంతరం పురోహితులు పంచాక్షరస్వామి, జగదీశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీకాంత్‌ప్రసాద్, ఉరుకుందప్ప, హనుమంతు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలనిచే సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్ఐ లక్ష్మణ్‌కు వినతి అందజేస్తున్న బాధిత మహిళలు, సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరురూరల్/టౌన్: వితంతు, వికగలాంగుల పింఛన్లు ఇవ్వని కడిమెట్ల సచివాలయ–1, సచివాలయం–3 , టీఎస్ కూల్లూరు వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు, ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, రూరల్ కార్యదర్శి శైలజ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయం–1, 3, టీఎస్ కూళ్లూరు వెల్ఫేర్ అధికారులు రాజకీయ దురుద్దేశంతో వితంతు, వికలాంగ పింఛన్లు పొందుతున్న మల్లేశ్వరి, గేషమ్మ, మోహరున్‌బీలకు పింఛన్ ఇవ్వకుండా, పై అధికారులు చెప్పినా పంపిణీ చేయకుండా నిలిపివేయటం ఏమిటని ప్రశ్నించారు. ఇన్ని సంవత్సరాలు ఇచ్చిన పింఛన్లను ఇప్పుడు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. అంగన్‌వాడీ వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లు పొందుతున్నారని, ఇక్కడ ఎందుకు ఇవ్వటం లేదన్నారు. అనంతరం ఆర్ఐ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు.